క్లుప్తంగా

వీఎంసీ భవన నిర్మాణ పనులు పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం సాయంత్రం అధికారులతో కలసి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో నిర్మాణ దశలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులు, అందుబాటులోని మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనంలో మూడో ఫ్లోర్‌లో జరుగుతున్న మార్బుల్, సీలింగ్, కరెంట్, ప్లాస్టింగ్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులను వేగంగా చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గద్దర్‌కు 'కొమ్మినేని' నివాళి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అనేక ప్రజా ఉద్యమాలను తీర్చిదిద్దిన గద్దర్ లేని లోటు పూడ్చలేనిదని సీ రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గద్దర్ పార్థివదేహం వద్ద కొమ్మినేని శ్రీనివాసరావు సోమవారం నివాళులు అర్పించారు. గద్దర్ కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. తన ఆట పాటలతో గద్దర్ ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని నింపారని కొమ్మినేని శ్రీనివాసరావు కొనియాడారు.

లక్ష్మీనారాయణ సేవా గుణాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అమినిగడ్డ లక్ష్మీనారాయణ సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు పెన్షనర్స్ పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏఎల్ నారాయణ సంతాప సభ భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగింది. లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన దాతృత్వాన్ని కొనియాడారు. నివాళులు అర్పించినవారిలో అసోసియేషన్ సెక్రటరీ సందక కృష్ణ, సంయుక్త కార్యదర్శి షేక్ ఇనయతుల్లా, కోశాధికారి యెనిగళ్ల భాస్కరరావు, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 8వ జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ సోమవారం నూలు వడుకుతున్న గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ స్వదేశీ ఉద్యమంలో చేనేత రంగం ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. అంతటి చరిత్ర కలిగిన చేనేత రంగానికి ప్రత్యేక రోజు ఉండాలనే ఉద్దేశంతో 2015 ఆగస్టు7న చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి, కె.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెప్టెంబరులో అక్కినేని శతజయంతి ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరులో ఘనంగా నిర్వహిస్తామని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద సోమవారం జిల్లా స్థాయి అక్కినేని నాగేశ్వరరావు అభిమానుల ఆత్మీయ సమావేశం, ఆపాత మధురాల సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ నాగేశ్వరరావు అభిమాన సంఘాల సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ పోలీస్ అధికారి డేవిడ్ రాజు మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో అక్కినేని యుగం స్వర్ణయుగమన్నారు. సినీ సంగీత విభావరిలో శ్యాంప్రసాద్, దుర్గా నాగమణి, మీనాకుమారి, కృష్ణకుమారి, షబానా, వెంకట్ పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు. ప్రజా గాయకుడు గద్దర్ మృతికి కళాకారులు శ్రద్ధాంజలి ఘటించారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే వెలంపల్లి
- 48వ డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన
- రూ. 14 లక్షల వ్యయ అంచనాతో రోడ్డు, డ్రెయిన్ పనులు ప్రారంభం



గౌతంస్కూల్ వీధిలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ ఆదిలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కార్పొరేషన్ అధికారులను కోరారు. 48వ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పరిశీలించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వినాయకుడి గుడి నుంచి ప్రారంభమైన పర్యటన, బంగారయ్య కొట్టు, ఈద్గామహల్ రోడ్డు, గౌతమ్ స్కూల్ రోడ్డు, టీనర్‌పేట అడ్డరోడ్డు, సారంగం రోడ్డు మీదగా సాగింది. వాగులోని వినాయకుడి గుడి వద్ద దెబ్బతిన్న రోడ్డు, మంచినీటి పైపులైన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే, మేయర్ రోడ్డు పనులకు పూజా కార్యక్రమాలు చేశారు. బాలభక్త సమాజం నుంచి బంగారయ్య కొట్టు వరకు రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 14 లక్షలతో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గౌతమ్ స్కూల్ రోడ్డు పనులను పరిశీలించారు.

టీనర్‌పేట అడ్డరోడ్డులో పర్యటించినప్పుడు స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి వేళ విద్యుత్ సమస్య ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా ప్రయోజనం ఉండటం లేదని స్థానికులు ఎమ్మెల్యేతో పేర్కొన్నారు. రోడ్డుపై నిలిపిన ఆటోలు, నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాగా చేసుకుని యువకులు మద్యం సేవిస్తున్నారని, రాత్రి వేళ బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంటోందని స్థానిక మహిళలు ఫిర్యాదు చేయగా, రాత్రి వేళ గస్తీని పెంచాలని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యంకు సూచించారు. కొండ ప్రాంతాల్లోని ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ అత్తులూరి పెదబాబు, అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అయితా కిశోర్, దుక్క దుర్గారావు, శీరం వెంకట్రావు, ఎండీ బాషా, చిచ్చా , వరలక్ష్మి, మొహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికర పరిష్కారాలను అందించాలి

మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్పందనలో అందుకున్న విజ్ఞప్తులకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందనలో వీరు పాల్గొన్నారు. వివిధ సమస్యలపై అందిన 21 ఫిర్యాదులను సంబంధిత విభాగం అధికారులకు అందించి నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. మొత్తం 21 ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగం-10, ఇంజినీరింగ్ విభాగం-3, రెవెన్యూ-4, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)-1, ఉద్యానవన విభాగం-1, పబ్లిక్ హెల్త్ విభాగం-2 ఉన్నాయి. స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌ను వీఎంసీ అన్ని విభాగాల ఉన్నతాధికారులు రోజూ సమీక్షించాలన్నారు.

ఫిర్యాదులు పెండింగులో లేకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్(జనరల్), యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, వీఏఎస్ డాక్టర్ రవిచంద్, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో 12 అర్జీలు

సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు స్పందన నిర్వహించగా సర్కిల్ - 2లో పట్టణ ప్రణాళిక విభాగం - 1, రెవెన్యూ - 1, పబ్లిక్ హెల్త్ విభాగం - 1 వచ్చాయి. పటమట సర్కిల్ - 3 కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ విభాగం - 1, ఇంజినీరింగ్ విభాగం -7, పట్టణ ప్రణాళికవిభాగం - 1 ఫిర్యాదులు రాగా చిట్టినగర్‌లోని సర్కిల్ -1లో ఫిర్యాదులు రాలేదని అధికారులు తెలిపారు.

తల్లి పాల విశిష్టత తెలుసుకోవాలి



తల్లిపాల విశిష్టతను తెలుపుతూ నర్సింగ్ విద్యార్థుల మైమ్ ప్రదర్శన

లబ్బీపేట(విజయవాడతూర్పు): తల్లి పాలతో బిడ్డకు కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. తల్లిపాల విశిష్టత ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రి పిడియాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు వేడుకలు సోమవారం నిర్వహించారు. డాక్టర్ కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలిస్తే తల్లీబిడ్డ ఇద్దరికీ ప్రయోజనం కలుగుతుందన్నారు. బిడ్డకు పుట్టిన అరగంటలోపు పాలివ్వడం ద్వారా శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు పాలివ్వడంపై తల్లులకు సరైన అవగాహన లేక పోవడం దురదృష్టకరన్నారు. తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని నర్సింగ్, ఇతర సిబ్బందికి నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. తల్లిపాలపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థులు తల్లిపాల ఆవశ్యతకను తెలియచేస్తూ ప్రదర్శించిన మైమ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ పి.అనీల్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సునీత, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఎదుగుదలకు ఆదినారాయణ కృషి మరువలేం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజంలో పేద విద్యార్థులు అభివృద్ధి చెందడానికి పింగళి ఆదినారాయణ చేసిన కృషిని మరువలేమని ఎల్ఐసీ ఏఓ పింగళి శ్రీరాములు అన్నారు. చైల్డ్ సైకాలజిస్ట్‌గా పని చేసిన ఆయన 'గిజూభాయ్' విధానాన్ని అమలు పరచిన తీరుతో విద్యార్థులలో సమానత్వాన్ని పెంపొందించారని తెలిపారు. పింగళి ఆదినారాయణ వర్ధంతి పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పింగళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హైస్కూల్‌లో మౌలిక వసతులను కల్పించేందుకు ఆదినారాయణ జ్ఞాపకార్థం ఆయన భార్య పింగళి ప్రమీల రూ.10వేల సాయాన్ని అందచేశారు.

కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ, కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఆర్.గోపాలం, సెక్రటరీ ఎం.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్‌లో అవయవదానం

నలుగురి జీవితాల్లో కొత్త వెలుగులు



టి. వీరభద్ర రావు (ఫైల్)

తాడేపల్లిరూరల్: అనారోగ్యంతో మణిపాల్ హాస్పిటల్‌లో చేరిన ఒక వ్యక్తికి బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో అతని అవయవాలతో మణిపాల్ హాస్పిటల్ వైద్యులు ఆ వ్యక్తి కుటుంబ సభ్యుల అనుమతితో మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. సోమవారం మణిపాల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కంటిపూడి సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా, గోదావరి వీధి, అరండల్‌పేట, వీటీసీకి చెందిన టి. వీరభద్రరావు (68) అనారోగ్యంతో స్థానికంగా ఉన్న హాస్పిటల్‌లో చేరింపించారు. మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌కు తీసుకు వచ్చారు. అప్పటికే అతను స్పృహ కోల్పోయి ఉండడంతో వైద్య పరీక్షల అనంతరం అతని బ్రెయిన్ డెడ్ అయినట్లు పరిగణించారు. అతని భార్య టి. అనూరాధ, కుమార్తె, కుమారుడు అంగీకారం మేరకు ఏపీ జీవన్‌దాన్ చైర్మన్ డాక్టర్ కె. రాంబాబు ఆధ్వర్యంలో అవయవదానం జరిగిందని, కాలేయం, ఒక కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమయిన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించామని, కార్నియా ఎల్.వి. ప్రసాద్ ఐ హాస్పిటల్ విజయవాడ, మరొక కిడ్నీ వేదాంత్ హాస్పిటల్, గుంటూరు తరలించామని తెలిపారు. అవయవదానానికి అంగీకరించి మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపిన వీరభద్రరావు కుటుంబానికి మణిపాల్ హాస్పిటల్స్ ధన్యవాదాలు తెలియజేస్తోందని అన్నారు.

మాదకద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయి

భవానీపురం(విజయవాడపశ్చిమ): జీవితాన్ని నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని ఎరూషలేము ప్రార్థనా మందిరంలో కాలనీ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ సభ్యులకు మాదక ద్రవ్యాలు - సోషల్ మీడియా దుర్వినియోగంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసవుతున్నారని, సరైన అవగాహనతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయవచ్చన్నారు. నవజీవన్ బాలభవన్ సైకాలజిస్ట్ అనూష మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా చేస్తున్న కీడును ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.

కార్యక్రమంలో కాలనీ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ ఎస్.శాంత కుమార్, సెక్రటరీ కె.పాపన్న, ఎం జాషువా తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యుత్ ఉద్యోగుల ధర్నా కారణంగా సామాన్య ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు, ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ కార్యాలయం సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా...

- చుట్టుగుంట నుంచి రామవరప్పాడు వైపునకు పడవల రేవు మీదుగా ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- మధురానగర్ జంక్షన్ నుంచి రామవరప్పాడు వైపునకు పడవల రేవు మీదుగా వాహనాలను అనుమతించరు.
- రామవరప్పాడు నుంచి పడవల రేవు (ఏలూరు రోడ్) వైపు ఎలాంటి వాహనాలు అనుమతించరు.
- గుణదల పోస్టాఫీస్ జంక్షన్ నుంచి ఈఎస్ఐ హాస్పటల్ కటింగ్ (ఏలూరు రోడ్) వైపు ఎలాంటి వాహనాలు అనుమతించరు.
- చుట్టుగుంట నుంచి రామవరప్పాడు వెళ్లాల్సిన వాహనదారులు చుట్టుగుంట జంక్షన్ నుంచి నైస్ బార్ జంక్షన్ - మధు చౌక్ - జమ్మిచెట్టు సెంటర్ - సిద్ధార్థ జంక్షన్ - అమ్మ కల్యాణ మండపం జంక్షన్ వద్ద కుడి వైపునకు రమేష్ హాస్పటల్ జంక్షన్ మీదగా వెళ్లాలి.
- రామవరప్పాడు నుంచి ఏలూరు రోడ్, బీఆర్టీఎస్ రోడ్డుకు వెళ్లాల్సిన వాహనచోదకులు రామవరప్పాడు నుంచి మహానాడు జంక్షన్ - రమేష్ హాస్పటల్ జంక్షన్ వద్ద కుడి వైపునకు , అమ్మ కల్యాణమండపం వద్ద ఎడమ వైపునకు, సిద్ధార్థ కాలేజి జంక్షన్, జమ్మి చెట్టు సెంటర్, మధు చౌక్, నైస్ బార్ జంక్షన్, పుష్ప హోటల్ జంక్షన్, దీప్తి జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- ఈఎస్ఐ హాస్పటల్ కటింగ్ (ఏలూరు రోడ్) నుంచి రామవరప్పాడుకు విద్యుత్ సౌధ మీదుగా ఎలాంటి వాహనాలకుగానీ, పాదచారులకుగానీ అనుమతి లేదు.


వాహనచోదకులు, ప్రజల ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాయనపాడు ఎల్‌సీ గేటు తాత్కాలికంగా మూసివేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ-రాయనపాడు మధ్యలోని ఎల్‌సీ గేటు నెంబర్ 150ను నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 11న ఉదయం 8 గంటల నుంచి 13వ తేదీ వరకు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. గొల్లపూడి నుంచి జక్కంపూడి రోడ్డు మార్గాన ప్రయాణించే వాహనచోదకులు సహకరించి ఇతర ప్రత్యమ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాల్సిందిగా వారు కోరారు.

బీసీల ఆరాధ్య దైవం మండల్

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసీల ఆరాధ్యదైవం బీపీ మండల్ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం బీపీ మండల్ డే నిర్వహించారు. తొలుత మండల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బోను దుర్గా నరేష్ మాట్లాడుతూ బీపీ మండల్ పోరాటంతోనే బీసీలకు రిజర్వేషన్ ఫలాలు అందాయన్నారు. బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన ఆగస్టు 7ను బీపీ మండల్ డే గా జరుపుకుంటున్నామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బీసీ హక్కుల కోసం మండల్ బాటలో పయనిస్తున్నారన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ కుల గణన చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం చంద్రశేఖర్ నాని, సంఘం నాయకులు మెండు జ్యోతి, కిరణ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పొంగు, తట్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి , మేయర్ భాగ్యలక్ష్మి



చిన్నారికి టీకా వేస్తున్న కార్పొరేటర్ గోదావరి గంగ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ ఏడాది చివరి నాటికి జిల్లాలను పొంగు, తట్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా మూడు విడతల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం భవానీపురంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ 5.0 లో భాగంగా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ సుహాసిని, డీఐఓ డాక్టర్ అమృత తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): జీరో నుంచి ఐదు సంవత్సరాల చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు.

మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని సర్కిల్-1 కార్యాలయం వెనుక ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా గోదావరి గంగ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, కార్పొరేట్ హాస్పటల్స్‌కు దీటుగా అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య సేవలు, మందులను ఉచితంగా అందచేస్తున్నారని తెలియ చేశారు.

ఎక్సెల్‌ప్లాంట్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



ఎక్సెల్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎంట్రన్స్ గేటు సమీపంలోని పార్కింగ్ వద్ద ఫ్లోరింగ్ రాళ్ళను ఏర్పాటు చేయాలని, ప్లాంట్‌కు రోజూ ఎంత చెత్త వస్తుంది అని సిస్టమ్‌లో నమోదవ్వాలని, చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించారు. కొత్తగా వేసిన రోడ్డుపై వాటర్‌ట్యాంక్ ద్వారా నీళ్లు పోసి ఎక్కడైనా నీరు నిలుస్తుందా లేదా అని పరిశీలించారు. ప్లాంట్ ఆవరణలో ఉన్న ట్రీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ స్క్రాప్, స్క్రాప్ ప్లేసింగ్ యూనిట్, ఆఫీసు బిల్డింగ్, మాట్రెస్స్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, సి-డి వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్, వెహికల్ పార్కింగ్ వంటి ప్రదేశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసారు. ప్లాంట్ ఆవరణలో పూర్తి స్థాయిలో పచ్చదనం పెంపొందించడానికి అన్ని చర్యలు చేపట్టాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్,, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొండ ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన



కొండ ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, వెలంపల్లి, భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతంలో దెబ్బతిన్న రెండు ఇళ్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి సోమవారం పరిశీలించారు. ఆయా ఇళ్ల నిర్మాణాల కింద వేసిన బేస్‌మెంట్‌కు సంబంధించి నిర్మించుకున్న పునాదుల్లో వేసిన కొండ రాళ్ల మధ్య మట్టి నానుడు వర్షాల కారణంగా జారిపోయి ఇంటి ముందు నిర్మించుకున్న రిటైనింగ్‌వాల్ (గోడ) కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వెలంపల్లి కలెక్టర్ ఢిల్లీరావును ఘటనా స్థలానికి తీసుకువచ్చి చూపించారు. ఆ ఇళ్లల్లో నివసించేవారు రాకపోకలు సాగించేందుకు అవకాశంకూడా లేకపోయిందని వివరించారు. ఆ పేద కుటుంబాలకు సహాయ సహకారాలను అందించాలని కోరారు.

38వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొడుతున్న కార్పొరేటర్ రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో సీఎస్ఐ చర్చి వెనుక భాగాన ఉన్న బూరగడ్డవారి వీధిలో రోడ్డు నిర్మాణ పనులకు 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఆమె మాట్లాడుతూ కొండపై నుంచి కిందకు వస్తున్న వర్షం, వాడుక నీటితో దిగువన ఉన్న దారి అధ్వానంగా తయారైందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ రోడ్డు నిర్మించాలని స్థానికులు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకున్న నాథుడు లేన్నారు. దీంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు సమస్యను స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడం, ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.8 లక్షలు మంజూరు చేయించారని వివరించారు. ఆ నిధులతో ఈ రోజు రోడ్డు నిర్మాణం ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, పార్టీ నాయకులు మంటి రాము, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభ్యున్నతితో మహిళా సాధికారత



సర్టిఫికెట్లు అందజేస్తున్న కృష్ణప్రభ

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆర్థికాభ్యున్నతితో మహిళా సాధికారత సాధ్యమని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ప్రెసిడెంట్ మాగంటి కృష్ణప్రభ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సోమవారం మూడు నెలలుగా నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ పూర్తైంది. ఈ సందర్భంగా బాలోత్సవ్ భవన్‌లో సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. కృష్ణప్రభ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టైలరింగ్ నేర్చుకోవడంతో మహిళలు వారి కాళ్లపై నిలబడతారనే విశ్వాసం కలుగుతుందన్నారు. రోటరీ క్లబ్ కూడా కుట్టుమిషన్ల పంపిణీ ద్వారా ఎం.బి.విజ్ఞాన కేంద్రంతో కలసి పని చేయాలని నిర్ణయించామన్నారు. టైలరింగ్ విద్యార్థులు కుట్టిన మోడ్రన్ డ్రస్సులను ప్రదర్శించారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షులు హరితాచౌదరి, సెక్రటరీ జి.సరస్వతి ఎం.బి.వి.కె మహిళా విభాగం బాధ్యులు పి.విజయ, కె. స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.